క్లుప్తంగా

ఘనంగా అప్పికొండమ్మ జాతర



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

గొలుగొండ: కృష్ణదేవిపేట గ్రామంలో గురువారం అప్పికొండమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఏటా జాతర సందర్భంగా విద్యుత్ అలంకరణ, బాణాసంచాతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. పోలీసులు, కమిటీ సభ్యులు భక్తులకు సేవలు అందించారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు



వ్యవసాయశాఖ అధికారి సుధారాణి

సాక్షి ఎఫెక్ట్..

గొలుగొండ: మండలంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయశాఖ అధికారి సుధారాణి తెలిపారు. సాక్షిలో గురువారం ఎరువు కరువు...కూటమిపై దరువు.. అనే కథనానికి వ్యవసాయశాఖ అధికారి స్పందించారు. ఈమె సాక్షి తో గురువారం మాట్లాడుతూ మండలంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటికే నాగాపురం రైతులకు 140 బస్తాలు, కృష్ణదేవిపేట రైతులకు 30 బస్తాలు, ఏఎల్‌పురం రైతులకు 15 బస్తాలు, కొంకసింగి రైతులకు 44 బస్తాలు ఈ రెండు రోజుల్లో అందజేయడం జరిగిందన్నారు. ఇలాగే అన్ని పంచాయతీల్లో ఎరువుల కొరత లేకుండా శ్రద్ధ తీసుకుంటున్నట్టు చెప్పారు.

ఈ-పోస్ మిషన్ల పంపిణీ



డీలర్లకు ఈ-పోస్ మిషన్లు అందజేస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం: ఈ-పోస్ మిషన్లను ఆర్డీవో వి.వి.రమణ గురువారం డీలర్లకు అందజేశారు. నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన 130 మంది డీలర్లకు వీటిని అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ప్రభుత్వం సరఫరా చేసిన స్మార్ట్ రేషన్ కార్డులకు అనుగుణంగా ఈ-పోస్ మిషన్లు తయారు చేయడం జరిగిందన్నారు. సేవలను సత్వరమే అందించేందుకు ఈ మిషన్లు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి డీటీ చందనరేఖ పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ



పౌష్టికాహార కిట్లను గర్భిణులకు అందిస్తున్న పీవో లలితకుమారి

కె.కోటపాడు : గర్భిణులు అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యమని కె.కోటపాడు ఐసీడీఎస్ పీవో లలిత కుమారి అన్నారు. లంకవానిపాలెంలో పోషణ మహోత్సవాలలో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గురువారం ఆమె వివరించారు. పప్పు దినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహార పదార్థాలు, ముఖ్యంగా రక్తహీనత సమస్య లేకుండా ఉండేందుకు ఐరన్ పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో అధికారులు

నర్సీపట్నం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 550 మంది నిరుద్యోగ యువతి యువకులు హాజరయ్యారు. 212 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.బాల తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికై న వారికి నియమాకపత్రాలు అందజేసారు. ఈ శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాలికుంటు టీకా పాడిపశువులకు రక్ష

పాడి పశువుల ఆరోగ్యానికి భరోసా కల్పించే గాలి కుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం మాడుగుల నియోజకవర్గంలో విస్తృతంగా జరుగుతుంది. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈ నెల నుంచి 15 నుంచి ప్రారంభమైన టీకా కార్యక్రమం వచ్చే నెల 15 వరకు కొనసాగుతుంది. గాలి కుంటు వ్యాధి నివారణకు టీకా ఒక్కటే మార్గం కావడంతో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి రైతు తమ పశువులకు టీకాలను వేయించుకోవాలని పశు వైద్యులు సూచిస్తున్నారు.

- నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా తప్పనిసరి
- టీకా వేయడంతో దూడల్లో మరణాలకు అడ్డుకట్ట
- మాడుగుల నియోజకవర్గంలో 69 వేల పశువులకు టీకా లక్ష్యం
- ఇప్పటి వరకు 6365 పశువులకు టీకాలు



దేవరాపల్లిలో పాడి పశువులకు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది



గాలి కుంటు టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పశు సంవర్ధకశాఖ ఏడీ దినేష్‌కుమార్

దేవరాపల్లి : పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు నాలుగు నెలలు వయసు దాటిన ప్రతి పశువుకు ఈ టీకా తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. గాలి కుంటు వ్యాధి టీకాలు సకాలంలో వేయించడం ద్వారా పాడి పశువులు మృత్యువాత పడకుండా నివారించవచ్చునని చెబుతున్నారు. మాడుగుల నియోజకవర్గం పరిధిలోని మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల పరిధిలోని గ్రామాలలో ఈ టీకా కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నారు. ఇప్పటి వరకూ నియోజకవర్గంలో 69 వేల పశువులు(ఆవులు, గేదెలు) టీకా వేసేందుకు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 6365 పశువులకు టీకాలు వేశారు.

వ్యాధి లక్షణాలు ఇలా....

- గాలి కుంటు వ్యాధి సూక్ష్మక్రిముల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకిన సోకిన పశువుల్లో తీవ్రమైన జ్వరం, నీరసం వచ్చి బక్కచిక్కిపోతాయి. నోటి నుంచి తీగల మాదిరిగా సొంగ కార్చుతుంది.
- నోరు, కాలి గిట్ల మధ్య పుండ్లు వచ్చి అనతి కాలంలోనే వ్యాధి ముదిరిపోతుంది. కొద్ది పాటి ఎండకు రొప్పడం, చూడి పశువుల ఈసుకుపోతాయి. ఈ వ్యాధి సోకిన పశువుల ముడుచుకుని పడుకుంటూ మేత, నీళ్లు సరిగ్గా తీసుకోక పోవడం తదితర లక్షణాలు ఉంటాయి.

వ్యాధి సోకితే కలిగే నష్టాలు....

పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం, పాలు తాగే దూడలలో మరణాలు సంభవించడం, వైద్యులు తక్షణమే స్పందించకుండా నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.

నిర్లక్ష్యం చేయొద్దు..



గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల పట్ల పాడి రైతులు నిర్లక్ష్యం చేయొద్దు. నాలుగు నెలలు వయసు దాటిన ప్రతీ పశువుకు టీకా వేయించాలి. దేవరాపల్లి మండలంలో 15,650 ఆవులు, గేదెలకు టీకా వేయడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2830 పశువులకు టీకాలు వేయడం పూర్తి చేశాం. ఈ టీకా వేయడం ద్వారా పశువుల ఆరోగ్యం ఉంటాయి. గ్రామాలలో పశు వైద్య సిబ్బందికి సహకరించి పశువులకు టీకా వేయించుకోవాలి.

– జి. గాయిత్రీదేవి, పశు వైద్యాధికారి, దేవరాపల్లి

యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం



ములగపూడి సచివాలయంలో బుధవారం ఒక్క రోజు యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

నాతవరం : ఖరీఫ్ పంట సాగుకు కావలసిన యూరియా కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో సరఫరా చేయలేకపోతుందని ములగపూడి ఎంపీటీసీ సభ్యులు తమరాన లోవకృష్ణ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఎం.బెన్నవరం గ్రామ సచివాలయ పరిధిలోగల గ్రామాల్లో రైతులకు బుధవారం ఒక్కరోజు మాత్రమే యూరియా సరఫరా చేశారన్నారు. ఎం.బెన్నవరం గ్రామ సచివాలయ పరిధిలో ములగపూడి, ఎం.బెన్నవరం. డొంకాడ, గాంధీనగరం గ్రామాలు ఉన్నాయన్నారు. గాంధీనగరం పంచాయతీ తాండవ రిజర్వాయరు ఆయకట్టు పరిధిలో ఉందన్నారు. ఈ గ్రామంలో అధిక శాతం రైతులు వరినాట్లు వేసారన్నారు. అలాగే ఎం.బెన్నవరం సచివాలయ పరిధిలో గ్రామాలకు వెర్రిగెడ్డ ఆనకట్టు తాండవ రిజర్వాయరు నీరు ప్రవహిస్తుందన్నారు. రైతులంతా ఆగష్టు నుంచి యూరియా కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. బుధవారం ఒక్కరోజు మాత్రమే అరకొరగా రైతులకు సచివాలయ సిబ్బంది యూరియా సరఫరా చేసారన్నారు. అధికారులు చెబుతున్న దానికి క్షేత్రస్థాయిలో యూరియా పంపిణీకి పొంతన లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో సచివాలయానికి ఎప్పుడు వెళ్లినా యూరియాతో పాటు ఇతర ఎరువులు అందుబాటులో ఉండేవని ఎంపీటీసీ సభ్యుడు లోవకృష్ణ గుర్తు చేశారు.

మహిళల ఆరోగ్యంతోనే బలమైన కుటుంబాలు



మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీను తదితరులు

మాడుగుల : స్వస్థ్ నారీ అభియాన్‌లో భాగంగా సత్యవరం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 130 మంది మహిళలకు బీపీ, షుగర్, జ్వరాలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రాథమికంగానే పరీక్షలు నిర్వహించుకుని జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యం దరిచేరదని ఈ సందర్భంగా కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి తలారి శ్రీను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ నాగమణి రామారావు, సచివాయ సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, ఎంపీహెచ్‌వో కృష్ణ, గోవిందు, బెలకమ్మలు పాల్గొన్నారు. వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మెట్టపాలెం హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు అనుషా, సుమ వైద్య సేవలు అందించారు. ఎంపీటీసీ రాంప్రసాద్, జెడ్పీటీసీ రమణమ్మ, సర్పంచ్ అర్జున్, టీడీపీ మండల ప్రెసిడెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

నాతవరం: మండలంలో వల్సంపేట గ్రామంలో గురువారం నాతవరం పిహెచ్‌సి వైద్యాధికారి కాళ్ల ప్రసన్నకుమార్ వైద్య శిబిరం నిర్వహించారు, ఈశిబిరంలో 97మంది రోగులకు పరీక్షించి మందులు అందజేసారు. ఎక్కడైనా గ్రామాల్లో జ్వరాలు వస్తే మా దృష్టికి తీసుకువస్తే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

రెండు గ్రామాల్లో స్వస్థ్ నారీ వైద్య శిబిరాలు

దేవరాపల్లి: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవరాపల్లి పీహెచ్‌సీ పరిధిలో తెనుగుపూడిలోను, వేచలం పీహెచ్‌సీ పరిధిలో కలిగొట్లలోను మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను గురువారం నిర్వహించారు. తెనుగుపూడిలో డా. డి. వనజ, ఆయుర్వేద వైద్యాధికారి డా. జి. గ్రీష్మ 156 మందికి వైద్య సేవలందించారు. కలిగొట్లలో రమేష్‌బాబు 75 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కలిగొట్ల జరిగిన వైద్య శిబిరానికి స్థానిక సర్పంచ్ సుధారాణి సహకారం అందించారు. దేవరాపల్లి పీహెచ్‌సీ సిహెచ్‌వో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: వరిలో తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ సూచించారు. మండలంలోని కొత్తపెంట, బోయిలకింతాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. వరి పంట దుబ్బు చేసే దశలో తెగుళ్ల సోకే ప్రమాదం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి పిలకలకు పాము పొడ(పాచి తెగులు) తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. ఈ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ప్రతి బోయిలకింతాడ, కొత్తపెంట సర్పంచ్‌లు బాబూరావు, వెంకటరావు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రావికమతం : కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు మండలంలో మత్సవానిపాలెం గ్రామంలో వరి పంటను పరిశీలించారు. రైతులతో సమావేశమయ్యారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజ్ కుమార్ మాట్లాడుతూ వరి పంటలో అధిక దిగుబడులకు సూచనలు చేశారు. వ్యవసాయ సమాచారం కోసం రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 18004198800 ను సంప్రదించాలని తెలిపారు.

బైండోవర్ చేశాక మళ్లీ పట్టుబడితే రూ.లక్ష జరిమానా

నాతవరం: తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశాక మరలా పట్టుబడితే చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయని నాతవరం తహసీల్దార్ ఎ,వేణుగోపాల్, ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ పలువురు పట్టుబడ్డారు. వారిపై నాతవరం ఎస్‌ఐ కేసు నమోదు చేసి గురువారం తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా వారికి కౌన్సెలింగ్ చేశారు. మళ్లీ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుండగా పట్టుబడితే లక్ష రూపాయలు జరిమానాతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు పెడతామని హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్లు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

నానో యూరియాపై క్షేత్రస్థాయి ప్రచారం

రోలుగుంట : మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నానో యూరియా వినియోగంపై క్షేత్ర పాఠశాలలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం కొంతలం గ్రామంలో డీఆర్సీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సిహెచ్.చిరంజీవి మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా ఎకరానికి అర లీటరు పైపాటు పిచికారీ చేసి యూరియా ఇచ్చే ఫలితాన్ని పొందవచ్చన్నారు. దీని వినియోగం వల్ల ఖర్చు తగ్గి దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయని డీఆర్సీ నుంచి వచ్చిన ఏవో పి.విజేత తెలిపారు. జీవన ఎరువుల గురించి వివరించారు. నర్సీపట్నం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు టి.శ్రీదేవి, డీఆర్సీ ఏడీఏ ఝాన్సీలక్ష్మి, ఆత్మ బీటీఎం లక్ష్మీ కిషోర్, గ్రామస్థాయి సచివాలయ వ్యవసాయ సహాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు



లంకవానిపాలెంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : మహిళలు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు స్వస్థ్ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో బాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శైలజ తెలిపారు. పీహెచ్‌సీలో మహిళలకు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు గుండె వ్యాధులు, గర్భాశయ ముఖ ద్వార, నోటి, బ్రెస్ట్ కేన్సర్ వ్యాధులపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. 70 ఏళ్లు పైబడిన వారికి ప్రధానమంత్రి వయోవందన యోజన కార్యక్రమంలో రిజిస్ట్రేషన్‌ను జరిపారు. వైద్యులు వైదేహి, కుసుమరాణి, సుమన్‌లత, చంద్రవదన, పీహెచ్ఎన్.ప్రమీలా, ఎంపీహెచ్ఈవో. శంకరరావు, హెచ్ఎస్.హిక్సియా, హెల్త్ అసిస్టెంట్ త్రినాధ్, ఎంపీటీసీ నెక్కల గోపి పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య సూచనలు

మాడుగుల రూరల్ : మహిళల ఆరోగ్య సంరక్షణకు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ఒక వరమని మాడుగుల ఐసీడీఎస్ సీడీపీవో యర్రయ్యమ్మ పేర్కొన్నారు. గురువారం కె.జె.పురం కళావేదిక వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం ద్వారా అర్హులైన గర్భిణులకు మొదటి కాన్పునకు రూ.5వేలు, రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టిన గర్భిణికి రూ.6వేలు గర్భిణి ఖాతాలో వేస్తారన్నారు. ఈ శిబిరంలో కె.జె.పురం వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆయుష్ వైద్యాధికారి శ్రీదేవి సారథ్యంలో మహిళలకు క్యాన్సర్, ఇతర పరీక్షలు నిర్వహించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

దేవరాపల్లి: గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి డి.వి.లక్ష్మీనారాయణ సూచించారు. తెనుగుపూడిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్లు వస్తున్నారా లేదా అని ఆరాతీశారు. స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి కనకరాజు పాల్గొన్నారు.

తప్పని యూరియా ఇక్కట్లు

మాడుగుల : ఈ ఏడాది యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని మాజీ పీఎసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డపు భాస్కరరావు అన్నారు. గురువారం సాయంకాలం ఆయన సాక్షితో మాట్లాడారు . ప్రస్తుతం వరి నాట్లు పూర్తి కావడంతో రైతులందరూ యూరియాపై ఆధారపడి ఉన్నారని అన్నారు. వొమ్మలి గ్రామంలో యూరియా దొరకక, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటువంటి ఇబ్బందులు లేవన్నారు.

22 నుంచి నవరాత్రి ఉత్సవాలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శరనవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండల రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో 22 వ తేదీ నుంచి 2వ తేది వరకు ఉదయం 9 గంటల నుంచి అష్టలక్ష్మి కుంకుమ పూజలు జరుగుతాయని, పూజలో పాల్గొనే భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

కె.అగ్రహారంలో వైద్యశిబిరం

మాకవరపాలెం : మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు బూరుగుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి చరిష్మ అన్నారు. కొండల అగ్రహారం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల క్యాన్సర్‌లపై పరీక్షలు చేశారు. సర్పంచ్‌అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

కె.కోటపాడు : రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎ.కోడూరు రైతు సేవా కేంద్రం వ్యవసాయశాఖ సహాయకుడు ఎ.అప్పలనాయుడు తెలిపారు. పొడుగుపాలెం గ్రామంలో గురువారం ఈ-క్రాప్ నమోదు కార్యక్రమం నిర్వహించారు.సాగులో ఉన్న వరి, చెరుకు, సరుగుడు, యూకలిప్టస్, మామిడి సాగు వివరాలను, ఆయా విస్తీర్ణం కూడా ఈ-క్రాప్‌లో ఈ నెల 30లోగా నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మాడుగుల : కింతలి సబ్‌స్టేషన్‌కు కొత్త లైన్ వేయడం కోసం గాదిరాయి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, నర్సీపట్నం ఈఈ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. వొమ్మలి, వీజేపురం, గాదిరాయి, సత్యవరం, డి. గొటి వాడ, కొత్తవలస, వెలగలపాడు, జేడీపేట, కింతలి, కింతలి వల్లాపురం, ఎం.కృష్ణాపురం, పొంగలిపాక, జాలంపల్లి, పొన్నవోలు, అవురువాడలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



కొత్తకోటలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ సంఘ ఉపాధ్యాయులు

రావికమతం : రాష్ట్ర,జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి, మండల శాఖ కొత్తకోటలో గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. కొత్తకోటకు చెందిన పీఎం నాగజ్యోతి ,రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని, కొత్తకోట మెయిన్ స్కూల్ హెచ్ఎం రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. వీరిని కొత్తకోట మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో పీఆర్‌టీయూ మండల కార్యవర్గం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించింది. ఎంఈవో లింగమూర్తి, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి నాయుడు , కొత్తకోట హైస్కూల్ హెచ్ఎం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



ఐసీడీఎస్ కార్యాలయంలో సీమంతాలు జరిపిస్తున్న సీడీపీవో మంగతాయారు తదితరులు

రావికమతం: రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో గురువారం గర్భిణులకు సీమంతాలు,పోషణ విద్య సంపూర్ణ పోషకాహార ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార స్టాల్ ఏర్పాటు చేశారు. 20మంది గర్భిణులకు సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాశన జరిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో మహేష్, సీడీపీవో మంగతాయారు, సర్పంచ్ మోది నాయుడు మంగ, ఏసీడీపీవో పుష్పాదేవి పాల్గొన్నారు.

కేజేపురంలో పసర మోదమ్మ పండగ



పొలాల్లోని పసరమోదమ్మకు పూజలు చేయడానికి వెళుతున్న రైతులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో పసర మోదమ్మ పండగను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా ఖరీఫ్ వరినాట్లు పూర్తయిన తర్వాత పాడి, పంట సుభిక్షంగా ఉండాలని కోరుతూ రైతులు సామూహికంగా ఈ పండగను చేయడం ఆనవాయితీ. రైతులు గ్రామం నుంచి ఊరేగింపుగా డప్పులతో దబ్బకుంట రహదారిలో పొలం మధ్యలో ఉన్న పసరమోదమ్మకు పసుపు, కుంకుమతో కూడిన నీరు (వసంతకం) మోదమ్మ ప్రతిమల మీద వేసి, ఆ నీటిని మరలా పట్టి, పశువుల మీద, పంటపొలాల మీద చల్లి, పాడి పంట బాగా ఉండాలని కోరుకున్నారు. ఈ పండగలో సర్పంచ్ రమణబాబు, ఉప సర్పంచ్ గోవిందరాజులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ



సత్యవరంలో స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ



బోయిలకింతాడలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాబూరావు

మాడుగుల : మండలంలో స్మార్ట్ రైస్‌కార్డు పంపిణీ నత్తనడకన జరుగుతుంది. యూరియా కోసం లైన్‌లో పడిగాపులు కాసినట్లుగానే స్మార్ట్ కార్డులకు కూడా ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. మండలంలో 22 వేల 370 మందికి స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేయవలసి ఉంది. ఎంపీటీసీ అప్పారావు, సర్పంచ్ నాగమణి రామారావు, ఉపసర్పంచ్ పెంటయ్య పాల్గొన్నారు.

దేవరాపల్లి: బోయిలకింతాడలో స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు చేతులమీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది.వీఆర్‌వో కె. రామకృష్ణ, అన్నం రామునాయుడు, కొప్పాక వెంకటరావు, కొమర బాబురావు, నాగేశ్వరరావు, శంకరరావు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వైఎస్సార్‌సీపీ నేతల సత్కారం



ఎంపీడీవోను సత్కరించిన మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం: రావికమతం మండల ఎంపీడీవోగా మహేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం రావికమతం మండల వైఎస్సార్ పార్టీ కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, వైస్ ఎంపీపీలు దంట్ల వెంకటరమణ, మత్సా భవాని ప్రసాద్,మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, సర్పంచ్ గుమ్మాల గణేష్, మలిచెట్ల గణేష్, విరోధి రాజారావు, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ధనంజయ్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

456 పశువులకు టీకాలు

కె.కోటపాడు : వర్షాకాలంలో ప్రధానంగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకే పరిస్థితి ఉంటుందని చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అన్నారు. పశువైద్య కేంద్రం పరిధిలో గల కె.సంతపాలెం, చంద్రయ్యపేట, శృంగవరం, కొత్తభూమి గ్రామాల్లో గాలికుంటు టీకాలను వేసే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. 456 పశువులకు ఈ కార్యక్రమంలో భాగంగా టీకాలు వేశారు. ఈ నెల 15 నుండి అక్టోబర్ 15 వరకూ గ్రామాల్లో మూడు నెలలు దాటిన ప్రతీ పశువుకు పశువైద్య సిబ్బంది టీకాలను వేస్తున్నట్టు తెలిపారు. పశువైద్య సిబ్బంది కనకారావు, జగన్, సంతోష్, తేజ పాల్గొన్నారు.

సుడిదోమ నివారించాలి

చీడికాడ : వరిపంటను ఆశించే సుడిదోమ నివారణపై రైతుకు అవగాహన అవసరమని ఏఓ కృష్ణవేణి అన్నారు. గురువారం ఆమె చీడికాడ, జి.కొత్తపల్లిల్లో సుడిదోమ ఆశించిన వరిపైరును పరిశీలించారు. సమీపంలో గల అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను సంప్రదిస్తే సుడిదోమనివారణ మందులను సూచిస్తారన్నారు.